



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

వసతిలో.. అర్ధాకలి

ఆకలి కేకలు.. అర్ధాకలితో వసతిగృహాల విద్యార్థులు అల్లాడుతున్నారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు కడుపు నిండక నకనకలాడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు పాలకులు చెబుతున్నా ఇది ఆచరణలో కనిపించడంలేదు. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తుందన్న ఆరోపణలున్నాయి. తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు ఇవ్వకపోతే విద్యార్థుల ఆకలి ఎలా తీర్చాలి.. హాస్టళ్లను ఎలా నిర్వహించాలని వార్డెన్లు ప్రశ్నిస్తే.. ఏముంది అప్పులు చేయండి.. సరుకులు తెచ్చి వండి పెట్టండి.. అంటూ ఉన్నతాధికారుల ఆదేశాలతో వసతిగృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేయాల్సి వస్తోంది. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచనిస్థితిలో సంక్షేమాధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వార్డెన్లు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సూచిస్తున్న భోజన పట్టికను అమలు చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వసతిగృహాల్లో నెలకొంది. భోజన మెనూ పరిస్థితి ఇలా ఉంటే విద్యార్థులకు ఇవ్వాల్సిన దుప్పట్లు, నోటు పుస్తకాలు, ప్లేటులతో పాటు కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం నాలుగు నెలలుగా విస్మరించింది. సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలతో అల్లాడుతున్న విద్యార్థులకు కొన్ని నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణకు విడుదల కావాల్సిన కనీస నిధులు విషయంలోనూ ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శిస్తోంది.

- విద్యార్థుల ఆకలి కేకలు
- హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం
- అప్పుల ఊబిలో హాస్టళ్ల వార్డెన్లు
- 9 నెలలుగా విడుదల కాని బిల్లులు
- విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలకూ దిక్కులేదు
- దుప్పట్లు, నోట్‌బుక్స్ పంపిణీ మరిచిన వైనం
- కూటమి ప్రభుత్వంలోనూ విడుదల కాని బకాయిలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

భోజనం అందక అర్ధాకలి. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. తలకు నూనె లేదు.. స్నానానికి సబ్బులేదు.. రాసుకోవడానికి నోటు పుస్తకాలు లేవు.. ఇదీ ఉమ్మడి గుంటూరు పరిధిలోని హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి.



సంక్షేమం సంక్షోభంలో పడటంతో విద్యార్థులు అర్ధాకలిలో అలమటి స్తున్నారు. వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలుముకుంది. గత విద్యా సంవత్సరం డిసెంబరు నుంచి వసతిగృహాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లిం చలేదు. వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారం భమైన ఈ విద్యా సంవత్సరంలో నాలుగు నెలలు గడిచినా నేటి వరకు వసతిగృహాలకు నిధులు విడుదల చేయలేదు. దాదాపు తొమ్మిది నెలలుగా వసతి గృహాల బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయినా ప్రభుత్వంలో స్పంద నలేదు. కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులతో పాటు నోటు పుస్తకాలు, దుప్ప ట్లు, ప్లేట్లు, ట్రంకుపెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్క రికి కూడా పంపిణీ చేయలేదు. ఎస్సీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యా లకూ ప్రభుత్వం గండి కొడుతున్నదన్న విమర్శలున్నాయి. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు ప్రభుత్వం భోజన బిల్లు రూ.1.40 లక్షలు చెల్లిం చాలి. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఇప్పటి వరకు రూ.12.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. నెల నెలా అప్పు చేసి వసతిగృహాలను నిర్వహిం చాల్సి వస్తోంది. బిల్లుల బకాయి లు పేరుకు పోతుండ టంతో సంక్షేమాధికా రులు అప్పుల ఊబిలో కూరు కుపోయారు. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు గతంలో చెల్లించే వారు. వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం ఎత్తేసింది. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీడీ అందజేసి బియ్యం వసతి గృహాలకు చేర్చుకోవాలి. హెచ్‌డబ్ల్యూవో లు సొంతంగా నగదు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ సిలెండర్‌ను వార్డెన్లే కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం తో సరుకులు, పాలు, కూరగాయల సరఫరా కూడా కొన్ని వసతి గృహాల కు నిలిచిపోయింది. దీంతో ప్రైవేట్ అప్పులు చేసి వీటిని కొనుగోలు చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం దుకాణాల్లో అప్పు దొరకని పరిస్థితులు నిర్వహకులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపులో ఇలానే జాప్యం జరిగితే విద్యార్థులు భోజనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉంది. బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగినట్లు సమాచారం.

మెనూ.. మమ

వసతిగృహాల్లో ఉండే కళాశాల విద్యార్థులకు రోజుకు రూ.53.33, పాఠశాల స్థాయి విద్యార్థులకు రోజుకు రూ.46.66 ప్రభుత్వం చెల్లిస్తోంది. మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తే ఈ ధరకు భోజనం అందించలేని పరిస్థితి. ఉదయం రోజుకో రకం వేరుశనగ చట్నీతో అల్పాహారం, పాలు, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి రూ.2200 ఖర్చు అవుతున్నట్లు నిర్వహకులు చెబుతు న్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు ఒక్కొక్కరికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600 మాత్రమే చెల్లిస్తుం ది. ఉప్పు, పప్పులు, కూర గాయలు నూనె, గ్యాస్ ఒకటేమిటి అన్ని వస్తు వుల ధరలు భారీగా పెరిగాయి. ఈ స్థాయిలో ప్రభుత్వం వసతి గృహా లకు బడ్జెట్ పెంచడం లేదు. వసతి గృహాల నిర్వహణ అధికారులు ప్రభుత్వం ఇస్తున్న నిధు లు సరిపోక మెనూలో కోత విధిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మెనూ అమ లు చేయాలంటే సదరు అధికారి జీతం మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలని పదే పదే ప్రభుత్వానికి వసతి గృహాల నిర్వహణ అధికారులు ఇస్తున్న అర్జీలపై స్పందించడంలేదు. వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ఉన్న ధరలకు పొంతన లేదు. మెనూ ప్రకటించిన ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన చార్జీలను పెంచడాన్ని విస్మరించింది. దీంతో మెనూ ప్రకారం చికెన్, కోడి గుడ్డు విద్యార్థులకు ఇవ్వలేక కోతపెడుతున్నారు.



ఇంటి నుంచి నగదు వస్తేనే నూనె, సబ్బు

ప్రభుత్వం నెలవారీ కాస్మోటిక్ చార్జీలను విద్యార్థులకు చెల్లించడంలేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. విధి లేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7 నుంచి పదో తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున ఇవ్వాలి. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ చార్జీల కింద అదనంగా విడుదల చేయాలి. అయితే ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వసతిగృహాల్లో లైట్లు మార్చాలన్నా వార్డెన్లు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి తదితరాల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, వార్డెన్లు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయా వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- మార్చి కల్లా గృహాల నిర్మాణం పూర్తి కావాలి
- మన ఇల్లు - మనగౌరవంలో కలెక్టర్ వెంకటమురళి

సొంతింటి కల నెరవేర్చుకోవాలి



కాలనీలో సమస్యలు కలెక్టర్‌కు వివరిస్తున్న మహిళలు

బాపట్ల, సెప్టెంబరు 28: ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో గృహాలు నిర్మించుకుని సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మన ఇల్లు-మనగౌరవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మూలపాలెం లేఅవుట్‌లో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గృహాలు నిర్మించుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 3,436 ఇళ్లు రూఫ్, లెంటిల్ స్థాయిలో ఉన్నాయని డిసెంబరు నెలాఖరికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. వివిధ దశల్లో ఉన్న 18,526 గృహాలను వచ్చే ఏడాది మార్చికి పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయన్నారు. ఈ కారణంగా నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికి లబ్ధిదారుల అవసరం మేరకు స్వయం సహాయక సంఘాల ద్వారా అదనపు రుణం మంజూరు చేసి పనులను త్వరగా పూర్తి చేసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటివి లబ్ధిదారులకు అందుబాటులో ఉంచామన్నారు. బిల్లులు చెల్లించడంలో ఆలసత్వం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు ఏకరువు..

మూలపాలెం లేఅవుట్‌లో గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నవారు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మూడురోజులకొకసారి తాగునీరు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారని దీనివల్ల ఇబ్బందిగా ఉందని చెప్పారు. రోడ్లు సరిగ్గాలేవని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు సీసీరోడ్లు నిర్మాణానికి చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ జిల్లా అధికారి ప్రసాద్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావు, స్పెషలాఫీసర్ డి.శివలీల, హౌసింగ్ ఏఈ సాహితి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్లస్టర్లు

- నేతన్నలకు ఉపయోగ పడని వైనం
- జిల్లాలో మొత్తం 12 హ్యాండ్లూమ్ క్లస్టర్లు

చీరాల, సెప్టెంబరు 28: నేతన్నల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. క్లస్టర్ల నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర పైనే అవుతుంది. అయితే చేనేత కార్మికులు వినియోగించుకునేందుకు వీలుగా ప్రారంభించలేదు. దీంతో మగ్గం లేని చేనేత కార్మికులు తిప్పలు తప్పడం లేదు. జిల్లాలో మొత్తం 12 క్లస్టర్లు ఉన్నాయి. అందులో 8 చీరాల నియోజకవర్గంలో ఉన్నాయి.ఒక్కో క్లస్టరుకు సిరిసిల్ల నుంచి 4 మగ్గాలు సరఫరా కావాలి. సబ్సిడీ నూలు అందుబాటులో ఉంచాలి. అది జరగలేదు. కనీసం కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని ప్రారంభించి తమకు ఉపాధి కల్పిస్తారని కార్మికులు భావించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా ఆ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. చేనేత, జౌళి శాఖకు సంబంధించి సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ క్రమంలో పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి క్లస్టర్లను వినియోగంలోకి తెచ్చి మగ్గంలేని కార్మికులకు ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. లేదంటే అలంకార ప్రాయంగా ఉన్న ఆ భవనాలతో ఎరికి ప్రయోజనం ఉందని ప్రశ్నిస్తున్నారు.



అలంకారప్రాయంగా ఈపురుపాలెం సౌత్ బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్

స్వర్ణాంధ్ర 2047.. పోటీలు

- విజేతలకు డీఈవో అభినందనలు



వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో నారాయణరావు, డీవైఈవో వెంకటేశ్వర్లు

బాపట్ల, సెప్టెంబరు 28: వికసిత్ భారత్‌లో భాగంగా శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. మండలస్థాయిలో ఆయా అంశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. పోటీలను డీఈవో కె.నారాయణరావు, డిప్యూటీ డీఈవో జి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వ్యాసరచన పోటీలో కె.లక్ష్మీ సిందూర(ఉల్లిపాలెం హైస్కూల్) ప్రథమస్థానం, ఎస్కే. జహూరా(బాపట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానం, ఎస్కే. సమీరా(బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల) తృతీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీలో జి.కవిత(ఉల్లిపాలెం హైస్కూల్), ఎస్.నవ్య(సూరెపల్లి హైస్కూల్), కె.తేజశ్రీ(ఈపూరుపాలెం హైస్కూల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. డిబెట్‌లో చందలూరు హైస్కూల్‌కు చెందిన సి.హెచ్.గాయత్రి, ఎస్.దీపక్ ప్రథమ స్థానం, చీరాల ఏఆర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కె.లక్ష్మీభార్గవి, ఎ.అభిషేక్‌లు ద్వితీయ స్థానం, బాపట్ల గురుకుల పాఠశాలకు చెందిన జె.షణ్ముఖప్రియ, వై.పూజిత మేరిలు తృతీయ స్థానంలో నిలిచారు. బహుమతులు సాధించిన విద్యార్థులను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.నిరంజన్, టి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి ఎండి.సాధిక్ తదితరులు పాల్గొన్నారు.


LYCA PRODUCTIONS
OCT. 10
WORLDWIDE RELEASE
SUBASKARAN PRESENTS
SUPERSTAR RAJINIKANTH
వేట్టయన్
ద హంటర్
WRITTEN & DIRECTED BY T. J. GNANAVEL
AN ANIRUDH MUSICAL
DOP SR KATHIR ISC
HEAD OF LYCA PRODUCTIONS G.K.M. TAMIL KUMARAN
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA
ASIAN SURESH
SRI LAKSHMI MOVIES


people MEDIA FACTORY
CHITRALAYAM
MACHO STAR GOPICHAND
A SREENU VAITLA FILM
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
విశ్వం
T.G. VISHWA PRASAD VENU DONEPUDI
TELUGU


CULT CONCEPTS
From The Director of
మంత్ర మంగళ
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH RELEASE
PRODUCER :
ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE À DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS.
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


NANDAMURI TARAKA RAMARAO ARTS
yuvasudha arts
MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
AN ANIRUDH MUSICAL
IN CINEMAS NOW


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
ADITYA MUSIC
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI
Music SRI VENKAT Editor BALAKRISHNA BOYA DOP MALHARBHAT JOSHI
Choreography KAPIL Stunts STAR MALLI PRO LAXMI NIVAS


BLOCKBUSTER HIT
ASIAN SURESH
2D ENTERTAINMENT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
WRITTEN & DIRECTED BY C. PREMKUMAR
PRODUCED BY JYOTIKA · SURIYA
Co Produced by Rajsekar Karpoorasundarapandian
IN CINEMAS NOW



లయోలా పాఠశాలలో ఆటల పోటీల సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 28: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. స్థానిక లయోలా పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 ఫుట్‌బాల్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ఆరంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో హయాంలో క్రీడలను ఏర్పాటు చెయ్యాడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో హయాంలో విద్యతోపాటు, క్రీడలు, క్రీడా మైదానాలకు పూర్వవైభవం రానున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడాకారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినుకొండ మైదానంలో త్వరలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు జట్టు విజయం కోసం కష్టపడి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను రాయల్, మేడమ్ రమేష్, రెవరెండ్ ఫాదర్ జ్ఞానదేవన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఫాదర్.రవి, ఎంఈవో జఫ్రుల్లా, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 550 మంది క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన జనసేన పార్టీ నాయకులు నాగశ్రీనును నిర్వాహకులు దుశ్శాలవాతో అభినందించారు.

హోరా హోరీగా తలపడుతున్న జట్లు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఆటల పోటీలలో బాలికల విభాగంలో నెల్లూరు-పశ్చిమగోదావరి జట్లు తలపడగా నెల్లూరు జట్టు విజయం సాధించింది. విశాపట్నం- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు విజయం సాధించింది. గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలో గుంటూరు, విజయనగరం-కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణ జట్టు విజయం సాధించింది.

బాలుర విభాగంలో గుంటూరు-శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, పశ్చిమగోదావరి- ప్రకాశం మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం, విశాఖపట్టణం- కృష్ణ మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్టణం జట్టు విజయం సాధించాయి. నెల్లూరు - అనంతపురం, తూర్పుగోదావరి- కడప జట్లు మధ్య జరిగిన హోరా హోరీ పోటీలు డ్రాగా ముగిసాయి. పోటీలను తిలకించేందుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో సర్కిళ్ల పునర్విభజన

- కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు
- ఎస్ఈల నియామకాలపై నేటికీ సందిగ్ధత

గుంటూరు, సెప్టెంబరు 28: విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ పునర్విభజనకు శ్రీకారం చుట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసి ఆ మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే ఈపీడీసీఎల్ పరిధిలోనూ కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సీపీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే విజయవాడ సర్కిల్‌తో పాటు మచిలీపట్నం, సీఆర్‌డీఏ, గుంటూరు, ఒంగోలు సర్కిల్స్ ఉన్నాయి. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విభజిత జిల్లాలుగా రూపాంతరం చెందిన నరసరావుపేట(పల్నాడు), బాపట్ల జిల్లాలకు కూడా కొత్త సర్కిల్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన గతంలోనే ఉంది. అయినా గత ప్రభుత్వంలో ఇది కార్యరూపం దాల్చలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు, బాపట్ల జిల్లాలకు కూడా కొత్త విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కాగా గుంటూరు కేంద్రంగా ఉన్న గుంటూరు సర్కిల్‌లో గుంటూరు-1 డివిజన్, తెనాలి డివిజన్, నరసరావుపేట డివిజన్‌లున్నాయి. ఇకపై పల్నాడు సర్కిల్ ఏర్పాటైతే నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్‌లో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు ఉండనున్నాయి. అలానే బాపట్ల కేంద్రంగా ఏర్పాటైన బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు ఏర్పాటు చేశారు. ఇక సీఆర్‌డీఏ సర్కిల్‌లో అమరావతి, గుంటూరు-2 డివిజన్‌లు యథావిధిగానే ఉన్నాయి. వీటిలో కూడా పునర్విభజన జరుగుతుందా అనేది చూడాల్సి ఉంది. కాగా బదిలీల్లో అధికారుల పోస్టింగ్‌లు కల్పించిన యంత్రాంగం కొత్త కార్యాలయాలు ఎక్కడ అనే దానిపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సర్కిల్స్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)లుగా అదే స్థాయి అధికారులను నియమిస్తారా, ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్‌లు కల్పిస్తారనేది తేలాల్సి ఉంది. ఇక సర్కిల్స్‌లో కీలకమైన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో) అధికారి పోస్టు కొత్త సర్కిల్స్‌లో లేకపోవటం చర్చకు దారి తీస్తోంది. కాగా నేటికీ కొత్త సర్కిల్స్‌కు ఆపరేషన్ ఎస్ఈల నియామకాలు చేపట్టకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో ఉద్యోగుల పోస్టింగ్‌లు కల్పించకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కొత్త సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు ఏ కార్యాలయంలో విధులు నిర్వహించాలనేది ప్రశ్నార్థకంగా మారింది.

సచ్చిదానందమూర్తి రచనలు నేటి జీవన స్థితిగతులకు మార్గదర్శకాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ గంగాధరరావు

పెదకాకాని, సెప్టెంబరు 28: పద్మవిభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి ప్రపంచ తత్వవేత్తల్లో ఒకరుగా నిలుస్తారని నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు పేర్కొన్నారు. సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సు వివరాలను శనివా రం ఆయన విలేకర్లకు తెలిపారు. తత్వశాస్త్రంలో తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా సచ్చిదానందమూర్తి నిలుస్తారన్నారు. సంగం జాగర్లమూడి ప్రాంతానికి చెందిన కొత్త సచ్చిదానందమూర్తి సాధారణ ప్రొఫెసర్ స్థాయి నుంచి యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా ఎదగడం తెలుగువారికి గర్వకారణమన్నారు. సచ్చిదానందమూర్తి రచనలు నేటి ఆధునిక జీవన స్థితిగతులకు మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన తెలుగుజాతి గర్వించేలా ఎదిగారని తెలిపారు. ఆయన జన్మించి శత వసంతాలైన సందర్భంగా ఆయనను గౌరవించుకోవడం యూనివర్సిటీ బాధ్యతని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీగా ఏర్పడక ముందు నల్లపాడులో ఏర్పాటుచేసిన పీజీ సెంటర్‌కు ఆయన స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారన్నారు. సచ్చిదానందమూర్తి రచనలను నేటి తరానికి పరిచయం చేసేందుకు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ రిఫ్లెక్షన్స్ ఆన్ 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఈ సదస్సుకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్య ప్రసాద్, నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ, పొన్నూరు శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె. ఎస్. చలం పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సులో న్యూఢిల్లీలోని ఢిల్లీ యూనివర్సిటీ ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అశోక్ వోహ్రా కీలక ఉపన్యాసం ఇస్తారని వీసి వెల్లడించారు. ఆచార్య త్రిమూర్తి రావు కన్వీనర్‌గా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సుకు దేశ నలుమూలల నుంచి మేధావులు, ఉన్నత విద్యావంతులు హాజరవుతారని తెలిపారు.



బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య పి నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్‌లో ముగిసిన ఐసీఎన్ఏఎస్‌సీ సదస్సు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 28: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నాన్ లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో చైనాలోని షెంఝన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ మెహరిన్ మజుందరణి మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి నాగభూషణ్ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిషోర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 : సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అప్పికట్ల కిషోర్ ఎన్నికయ్యారు. 11వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న ఆయనను శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ పదవికి ఎన్నుకున్నారు. డెమోక్రటిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా జోసఫ్ కిషోర్, ఉపాధ్యక్షునిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా సూర్య ఎన్నికైన వారిలో ఉన్నారు. పలువురు ఉద్యోగులు వారిని అభినందించారు.



వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నకేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రత్యామ్నాయ సాగుపై ప్రణాళికలు రూపొందించాలి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28 : రైతు ఆర్థిక పరిస్థితి మెరుగుపడే విధంగా, అధిక లాభాలు ఆర్జించే ప్రత్యామ్నాయ పంటలసాగుపై ప్రతి రైతుకు అవగాహన కలిగించేలా ప్రణాళికలు రూపొందించేలా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన విభాగం పనిచేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం లాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి సందర్శించి, అధికారులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధనా స్థానాలు, విస్తరణ కేంద్రాల నుంచి ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ఏర్పాటు చేసిన పదర్శనలోని వంగడాలు, ఉత్పత్తులు, యంత్రపరికరాలు, పరిశోధన ఫలితాలను విశ్వవిద్యాలయ ఉప కులపతి శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు సత్యనారాయణ కేంద్రమంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనాన్ని, డ్రోన్ శిక్షణా సెంటర్ కేంద్ర మంత్రి పరిశీలించారు. పరిపాలన భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసి అధికారులను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. అదే విధంగా వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ డ్రోన్ల ద్వారా పురుగుమందులు, ఎరువుల పిచికారి చేసే విధానంను కేంద్ర మంత్రి పరిశీలించి, గ్రామీణ ప్రాంతయువత డ్రోన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవటంతో పాటు, ప్రభుత్వం అందించే వ్యవసాయ డ్రోన్లను క్షేత్రస్థాయిలో సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని బోర్డు మీటింగ్ రూములో విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లాలో వరద ముంపు వలన వ్యవసాయ శాఖ జరిగిన నష్టాలు, పరిహారం అందజేతపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వరద ముంపు వలన వ్యవసాయ, ఉద్యాన పంటలకు, పశువులకు జరిగిన నష్టాలు, ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం, రానున్న రబీ సీజన్ కు విత్తనాలు, ఎరువులు సన్నద్ధత, కౌలు రైతులకు రుణాల మంజూరుపై తదితర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ బార్గవ తేజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 28: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 590.00 అడుగులకు చేరుకుంది. ఇది 308.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5439 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 22,574 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 41,162 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 28 వేల 880 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 28: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 38 వేల 162 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.9 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 28వేల 880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 9వేల 282 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పీఆర్ ఉద్యోగులకు నిబంధనలపై అవగాహన తప్పనిసరి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 28: పంచాయతీ రాజ్ శాఖలోని అధికారులు, అన్ని స్థాయిల ఉద్యోగులు చట్టం, ప్రభుత్వ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగివుండడం తప్పనిసరి అని జిల్లా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024- 2025 ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, డీఎల్‌డీఓలు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్ జీవిఆర్ కె మూర్తి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధికారిక ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ ఆవశ్యకతను వివరించారు. టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ కె మధు కుమార్ మాట్లాడుతూ భవణ నిర్మాణ అనుమతులు , లే ఔట్స్ అనుమతులపై మాట్లాడారు. భవననిర్మాణ అనుమతుల ద్వారా, లేఔట్స్ అనుమతుల ద్వారా స్థానిక స్వపరిపాలన సంస్థలకు ఆదాయం సమకూర్చుకునే అవకాశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సిహెచ్ కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, నిరంజన్ రావు, కరిముద్దీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్

గుంటూరు, సెప్టెంబరు 28: ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ అర్చకసేవా సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా నారాయణం వేణుగోపాల్ ఎంపిక అయ్యారు. గత సంవత్సరం పూర్వ అధ్యక్షులు రొంపిచర్ల శేషాచార్యులు మరణించడంతో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేణుగోపాల్ కొనసాగుతున్నారు. శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నారాయణం వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘ ఆశయాల సాధన కోసం అహర్నిశలు పాటుపడతానని, అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బృందావనం రాధాకృష్ణ మూర్తి, ఆమంచి రవికుమార్, గొట్టిపాళ్ళ కృష్ణమాచార్యులు, దీవి వెంకట శేషుబాబు, పరాశరం జగన్మోహన్, నందివెలుగు శేషగిరిరావు, పెద్దింటి ఫణి రాజేంద్రకుమార్, చెగోలం శేషాచార్యులు, వివిధ జిల్లాల నాయకులు యనమదల ఆంజనేయులు, చిట్యాల మల్లికార్జునశర్మ, వడ్డమాను రమణాచార్య, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో నారాయణరావు, కమిషనర్ నిర్మల్‌కుమార్ తదితరులు

ముగిసిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు

బాపట్ల, సెప్టెంబరు 28 : నియోజకవర్గ స్థాయి 68వ స్కూల్‌గేమ్స్ ఎంపికలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగ, అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొంటారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు నుంచి 500మంది క్రీడాకారులు వివిధ విభాగాలలో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌లు పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటలు కూడా పిల్లలకు అవసరమన్నారు. కమిషనర్ నిర్మల్‌కుమార్ వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాద్, నియోజకవర్గ కోఆర్డినేటర్ కత్తి శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ రాంబాబు, తిరుపతిరావు, ప్రశాంత్, పీడీలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సంఘీభావదీక్ష

బాపట్ల, సెప్టెంబరు 28 : జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా బాపట్ల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ చేపట్టిన దీక్ష శనివారం కొండుభొట్లపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగింది. తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదం విషయంలో జరిగిన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా అధినేత పవన్‌కళ్యాణ్ దీక్ష చేపట్టారని, దానికి సంఘీభావంగా 11రోజులుపాటు శ్రీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు, సత్యనారాయణ, బీజేపీ నాయకులు కొత్తా వెంకటరామకృష్ణ, దమ్మనవారిపాలెం సర్పంచ్ జగ్గయ్య, విశ్వహిందూ పరిషత్ పట్టణ కార్యదర్శి బండ్రెడ్డి రజనీ, నాగమల్లేశ్వరి, జనసేన నాయకులు, వీరమహిళలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విప్లవ వీరకిషోరం భగత్‌సింగ్

బాపట్ల,సెప్టెంబరు 28 : పిన్నవయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు విప్లవవీరకిషోరం భగత్‌సింగ్ చిరస్మరణీయులని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరునవ్వుతో ఉరికంబంతో ఎక్కిన ఆయన భారతీయ పౌరుషానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జమ్మద్‌బాషా, కారుమూరి శ్రీనివాసరావు, రమేష్‌బాబు, చిన్ని, దయేశ్వరరావు, సురేష్, డానీయేలు, చంద్రబాబు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

డిక్లరేషన్‌ను వ్యతిరేకించటమంటే స్వామిని అగౌరపరచటమే : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 28 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవటానికి డిక్లరేషన్ ఇచ్చేందుకు వ్యతిరేకించటం స్వామివారిని అగౌరవ పరచటమేనని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానంలో కొన్ని వందల సంవత్సరాల నుంచి హిందూమతేతరులు స్వామి దర్శనం చేసుకోదలిచినప్పుడు ముందుగా తమకు స్వామిపట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చే సాంప్రదాయం ఉందన్నారు. దీనిని గౌరవించే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వంటి ఎందరో ప్రముఖులు డిక్లరేషన్ ఇచ్చి స్వామివారి దర్శనం పొందారన్నారు. దీనిపై జగన్ పిచ్చి ప్రేలాపనలతో దళితులను రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని కొల్లా విమర్శించారు.

నేడు అపవిత్రదోష పరిహార మహా హోమ కార్యక్రమం

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 28 : తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైన కారణంగా రాష్ట్ర జనసేనపార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్‌లు చేస్తున్న దీక్షకు మద్దతుగా మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అపవిత్రదోష పరిహార మహా హోమ కార్యక్రమం నిర్వహించబడుతుందని పిట్టలవానిపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మహ్మద్ హాస్సేన్‌బేగ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా బాపట్ల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ పాల్గొంటారని చెప్పారు.

సూర్యలంక హరిత రిసార్ట్స్‌కు బెస్ట్ రిసార్ట్స్ అవార్డు

బాపట్లరూరల్,సెప్టెంబరు 28 : బాపట్లసూర్యలంక సమీపంలోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన హరితాబీచ్ రిసార్ట్స్‌కు రాష్ట్రంలోనే బెస్ట్ బీచ్ రిసార్ట్స్ అవార్డు రావటం జరిగింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదగా అందుకోవటం జరిగిందని బాపట్ల హరితా రిసార్ట్స్ మేనేజర్ జి.అశోక్ తెలిపారు. సూర్యలంకతీరం పర్యాటకరంగంగా మరింత అభివృద్ధి చెందుతున్న తరణంలో ఇటువంటి అవార్డు హరితా రిసార్ట్స్‌కు రావటం ఓ మంచి పరిణామం. జిల్లాలో ఇటీవల పర్యాటక రంగ అభివృద్ధికి 100 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగినది. దీంతో సూర్యలంకతీరం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనున్నది.



బాపట్ల సూర్యలంక సమీపంలోని హరితా రిసార్ట్స్

రేబీస్‌పై అవగాహన కలిగి ఉండాలి

● డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మ

బాపట్ల, సెప్టెంబరు 28 : రేబీస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి యుండాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఎం అండ్ హెచ్‌వో అధ్యక్షత వహించి మాట్లాడుతూ కుక్కకాటుకు గురైన వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కుక్కకాటుకు గురైనవారు దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి వైద్యుల సలహాల మేరకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, బి.మరియమ్మ, సి.హెచ్‌వో నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బ్యానర్ ప్రదర్శిస్తున్న డాక్టర్ ఎస్.విజయమ్మ, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తదితరులు

చట్టబద్ధంగానే భూమి బదలాయింపులు

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 28 : నిషేధిత భూముల జాబితా 22ఎ నుంచి 22ఇ వరకు జరిగిన భూమి రిజిస్ట్రేషన్, బదలాయింపులన్ని జిల్లాలో చట్టబద్ధంగానే జరిగాయని కలెక్టర్ జె.వెంకటమురళి సీసీఎల్ఏకు తెలియజేశారు. రాజధాని నుంచి సీసీఎల్ఏ, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఆర్‌పి సిసోడియా కలెక్టర్‌తో వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కలెక్టర్ జిల్లాలో భూముల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లాలో నిషేధిత భూముల జాబితా నుంచి 6,363 ఎకరాలు తొలిగించగా అసైన్డ్‌భూములు 818 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరగగా 25 ఎకరాలు చట్టబద్ధంగానే బదలాయింపులు జరిగాయన్నారు. అలాగే చుక్కలభూమి కింద 1089 ఎకరాలు తొలిగించగా 23 ఎకరాలు చట్టబద్ధంగానే మార్పిడి జరిగాయన్నారు. 178ఎకరాల ల్యాండ్‌రికార్డ్స్ చట్టప్రకారమే మార్పులు చేసినట్లు వివరించారు. సర్వీస్ ఇనామ్‌భూములలో ఎలాంటి మార్పులు జరగలేదన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నిర్మించి ఒక ప్రాంతానికి సంబంధించిన దస్త్రాలను మరొక ప్రాంతానికి చెందిన వీఆర్వోలతో విచారణ జరిపించామన్నారు. విచారణ పక్కాగా నిర్వహించామని తహసీల్దార్‌లతో ధ్రువీకరణపత్రాలు తీసుకున్నట్లు కలెక్టర్ సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కె.ఆర్.ఆర్.సి ఉపకలెక్టర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం యంత్రాల త్రైమాసిక పరిశీలన చేసిన కలెక్టర్ బృందం



ఈవీఎం గోదాం సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 28 : ఈవీఎం యంత్రాల త్రైమాసిక పరిశీలనలో భాగంగా శనివారం బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో ఏర్పాటు చేసిన గోదాంను కలెక్టర్ జె.వెంకటమురళి పరిశీలించారు. గోదాం వద్ద విధులలో ఉన్న పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి సంబంధిత తనిఖీ దస్త్రంలో ఆయన సంతకం చేశారు. తదుపరి గోదాం తలుపులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం గోదాంలోని గదులకు సీల్ వేశారా లేదా అనేది పరిశీలించారు. ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు పటిష్ఠ భద్రత ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, రాజకీయపార్టీల నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, కాగిత కోటేశ్వరరావు, దోనేపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

మహాకవి గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకం

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ భార్య శిరీషా



మహాకవి గుర్రం జాషువా పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న తెన్నేటి శిరీషా తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 28 : మహాకవి గుర్రంజాషువా రచనలు స్ఫూర్తిదాయకమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ భార్య తెన్నేటి శిరీషా తెలిపారు. వివేకానంద కాలనీలోని ఎంపీ కార్యాలయం వద్ద శనివారం గుర్రంజాషువా 129వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి జాషువా పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భావకవిత్వాన్ని పక్కకు నెట్టి సామాజిక ప్రయోజనాలు కోసం ఎన్నోరచనలు చేసి ఆధునిక కవులలో మహాకవిగా జాషువా పేరుగాంచారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పఠాన్ రాజేష్, ప్రకాష్, ప్రసాద్, కొండలు, నాగార్జున, వంశీ, జనసేననాయకులు బ్రహ్మం, రాజేంద్ర, బీజేపీనాయకులు నరేంద్రగుప్తా తదితరులు పాల్గొన్నారు.

● గుర్రంజాషువా సేవసమాజంవారు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉంచిన ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీనవర్గాల కోసం ఆయన చేసిన సాంస్కృతిక, కవిత్వం సేవానిరతిని శ్లాఘించారు. కార్యక్రమంలో సేవాసమాజం అధ్యక్షుడు జాకబ్, ఉపాధ్యక్షులు గడ్డం ఏలియా, మాల్యాద్రి, జాషువా అభిమానులు, సాహితిభారతి సభ్యులు పాల్గొన్నారు.

● బాపట్ల,సెప్టెంబరు 28 : సమాజంలో హెచ్చుతగ్గులను, వివక్షతలపై తన గళాన్ని విప్పి చెప్పిన మహాకవి గుర్రంజాషువా అని సాహితి భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. మహాకవి గుర్రంజాషువా 129 జయంతి కార్యక్రమంలో శనివారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడారు. అనంతరం రచయితలు ఇబ్రహీం ఖలీలుల్లా, పువ్వాడ వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్ తదితరులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● రేపల్లె, సెప్టెంబరు 28:నవయుగ చక్రవర్తి, మహాకవి గుర్రం జాషువా పద్యం సాహిత్యం నేటి తరానికి మార్గదర్శకం అని ఎమ్మార్పీఎస్ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరి నారాయణ అన్నారు. శనివారం నిజాంపట్నం మండలం కూచినపూడిలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బేతపూడి రామారావు, దున్నా సంగీతరావు, మట్లపూడి రమేష్‌బాబు, రామారావు, పి.నాగేంద్రబాబు, టీడీపీ నాయకులు కొలసాని రాము, నల్లపాటి యల్లయ్య, చలపతి, ఎన్.రామకృష్ణప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 28 : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి కార్యక్రమాలను శనివారం అద్దేపల్లి మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు హెచ్ఎం ప్రశాంతి, పేరెంట్ కమిటీ వైస్ చైర్మన్ ఆమ్రేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ ఇరవై మూడేళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు.



భవనంవారిపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, పోలీసు సిబ్బంది

వాహనాలు నడిపే యువత హెల్మెట్ ధరించాలి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 28 : హెల్మెట్ లేని ప్రయాణం అత్యంత ప్రమాదకరమని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం గ్రామపంచాయతీలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామసచివాలయంలో గ్రామస్తులతో డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలోని కూడలి ప్రాంతాలు, ప్రవేశద్వారం తదితర ప్రాంతాలలో, సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ వెంకటకృష్ణ, చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోదుగుల శంకర్‌రెడ్డి, గ్రామపెద్దలు మద్దికర ధనగోవిందరెడ్డి, మోదుగుల రామకోటిరెడ్డి, దొంతిరెడ్డి మాధవరెడ్డి, కలకోట చక్రధర్‌రెడ్డి, అన్నపరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం విద్యుత్ ఏఈగా షేక్ బాషా

కర్లపాలెం,సెప్టెంబరు 28 : కర్లపాలెం మండల విద్యుత్‌శాఖాధికారిగా షేక్ బాషా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాషాను మర్యాదపూర్వకంగా కర్లపాలెం పంచాయతీ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తదితరులు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజి, కరీముల్లా, షేక్ జిలానీ, షేక్ రియాజ్, షేక్ గౌస్ ఉన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

బాపట్ల,సెప్టెంబరు 28 : విద్యుత్ వినియోగదారులు ఆదివారం సెలవు అయినా ఎలాంటి జరిమానా లేకుండా రెవెన్యూ కార్యాలయంలో బిల్లులు చెల్లించవచ్చని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఆంజనేయులు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సచివాలయం సందర్శించిన ఎంపీడీవో

కర్లపాలెం, సెప్టెంబరు 28 : మండలంలోని దమ్మనవారిపాలెం సచివాలయాన్ని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. సచివాలయం సిబ్బందితో సమావేశమై సచివాలయ పాలనపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్యం స్వర్ణాంధ్ర -2024 కార్యక్రమం, మన ఇల్లు-మన గౌరవంపై లబ్ధిదారుల ఇళ్ళకెళ్ళి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మామిడాల గాయత్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దమ్మనవారిపాలెం సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నిరుపేద యువతి పెళ్ళి ఖర్చులకు ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 28 : చందోలు గ్రామంలో అక్టోబరు 6వ తేదిన జరగబోయే వివాహానికి సంబంధించి శనివారం సయ్యద్ నిజాం తనవంతు రూ20వేలు ఆర్థికసాయాన్ని నిరుపేద కుటుంబానికి యువతి పెళ్ళి ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీనాయకులు అన్వర్, ఆరీబ్, సలీం, అమీరా, షేక్.మీరా తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర పోషకాల యాజమాన్యంపై అవగాహన ఉండాలి

చుండూరు, సెప్టెంబరు 28 : రైతాంగ పంటల సాగులో సమగ్ర పోషకాల యాజమాన్యంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మోదుకూరులో సమగ్ర పోషకాల యాజమాన్యంపై శనివారం జిల్లా రిసోర్స్ సెంటర్ అధికారులు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వరిలో జింక్ లోపం కనిపిస్తే జింక్ సల్ఫేట్ తగిన మోతాదులో వాడాలని, రైతులు అధిక నత్రజని వాడకం తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు మురళీధర్ నాయక్, రాధాకృష్ణ, డీడీఏ డీఆర్‌సి విజయనిర్మల, మండల వ్యవసాయ అధికారి బి.ఆదాంబాబు, శ్రీనివాసరావు, మాణిక్యరావు, రైతులు పాల్గొన్నారు.

కోటిపల్లిలో పోషణ మాసోత్సవాల ర్యాలీ

కొల్లూరు, సెప్టెంబరు 28 : పోషణ మాసోత్సవాల ర్యాలీని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నగరాజకుమారి నిర్వహించారు. మండల పరిధిలోని కోటిపల్లిలో దోనేపూడి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం పోషణ మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ, బలవర్ధక పదార్థాలు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత ఉండదన్నారు. చిరుధాన్యాలతో పాటు ఆకు కూరలు గర్భిణీలు, బాలింతలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.



పోషణ మాసోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజరు, అంగన్‌వాడీ కార్యకర్తలు

దొంగతనాలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 28 : మండలపరిధిలోని సంగుపాలెం కోడూరు, కోమలి గ్రామపంచాయతీలలో వివిధ దొంగతనాలకు పాల్పడిన బెజ్జం అశోక్‌ను శనివారం చందోలు ఎస్సై ఆర్.స్వామిశ్రీనివాస్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల ఆయా గ్రామాలలో నీళ్ళ విద్యుత్ మోటారు, 5జీ నెట్‌కేబుల్ వైర్ల దొంగతనం కేసులో అశోక్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్ఐ స్వామిశ్రీనివాస్, సిబ్బంది

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కొల్లూరు, సెప్టెంబరు 28 : వేమూరు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ వీరాంజనేయులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని 50 మంది రౌడీషీటర్లు, అనుమానితులను రప్పించి శనివారం వారితో మాట్లాడారు. పోలీసు రికార్డుల్లో ఉన్నవారంతా సత్ప్రవర్తనతో మెలగాలని ఎటువంటి గొడవలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన చర్యలు తప్పవన్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

'మన ఇల్లు.. మన గౌరవం'పై అవగాహన

కొల్లూరు, సెప్టెంబరు 28 : మండల కేంద్రం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో 'మన ఇల్లు - మన గౌరవం' అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ, టీడీపీ అధికారంలో ఉన్న 2019లో గృహ నిర్మాణం చేసుకుని బిల్లులు రాని లబ్దిదారులకు బ్యాలెన్స్ ఉన్న గృహాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు మళ్లీ బిల్లులు చెల్లింపులు చేస్తున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ పథకం ప్రభుత్వానికి ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం అని, వివిధ దశల్లో ఉన్న ఇళ్లను మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు పూర్తి బిల్లులు చెల్లిస్తారని, నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికి లబ్దిదారుల అవసరం మేరకు ఎస్‌హెచ్‌జి ద్వారా రూ.33 వేలు మంజూరు చేసి ఇంటి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా సహకారం అందించనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ గృహ నిర్మాణంపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కే.మధుసూదనప్రసాద్, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈఈ సీతారామయ్య, హౌసింగ్ ఏఈ సాంబశివరావు, టీడీపీ నాయకులు వై.శ్రీనివాసరావు, జీ.ప్రసాద్, గృహ నిర్మాణ లబ్దిదారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ

కళాశాల ప్రాంగణంలో వర్షపునీరు తొలగింపు

రేపల్లె, సెప్టెంబరు 28 : కళాశాల ప్రాంగణంలో పదిరోజులుగా నిలిచిన వర్షపునీటిని తొలగించాలంటూ విద్యార్థులు, ప్రజాసంఘ నాయకులు అధికారుల దృష్టికి తీసుకురావటంతో ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు స్పందించారు. జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరును తొలగించేందుకు శనివారం మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు ఆయిల్ ఇంజన్‌ల మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బయటకు తోడే విధంగా చర్యలు చేపట్టారు. రెండురోజుల్లో వర్షపునీరంతా పూర్తిస్థాయిలో తొలగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.



వర్షపునీటిని మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

అన్నదానాన్ని ప్రారంభించిన కేసన

నగరం,సెప్టెంబరు 28 : కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి ప్రీతికరమైన శనివారం రోజు అన్నప్రసాదంలో పాలు పంచుకోవటం ఆనందంగా ఉందని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని కేసన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలిగితే ఆకుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి మాజీ ఎంపీపీ కేసన కోటేశ్వరరావు, నాయక్, ఆలయ కమిటి సభ్యులు జగదీష్‌కుమార్, శివ, సాంబయ్య, సీతాపతి, ఎం.శ్రీనివాసరావు, ఎం.సాయి పాల్గొన్నారు.



నగరం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు బాల బాలికల ఎంపిక

వేమూరు, సెప్టెంబరు 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-2024 ఆధ్వర్యంలో మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో జిల్లా కబడ్డీ పోటీలకు సంబంధించిన బాల బాలికల జట్లను శనివారం ఎంపిక చేశారు. ఎంఈవో రోస్‌ల్యాండ్, ప్రధానోపాధ్యాయులు, నరసింహస్వామి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎంపిక కార్యక్రమానికి ఐదు మండలాల పరిధి నుంచి 200 మంది హాజరయ్యారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జట్లు అక్టోబరులో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. జట్ల ఎంపికలో ఎస్ఎంసీ ఛైర్మన్ వీ.విజయబాబు, నియోజకవర్గ కన్వీనర్ గోపాలరెడ్డి, మండల కన్వీనర్ రవిరాజు, కో-ఆర్డినేటర్ బుచ్చిబాబు, శ్యాంబాబు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పీఈటీలు

విద్యార్థులు క్రీడలలో రాణించాలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 28 : ప్రతి విద్యార్థి క్రీడలపై శ్రద్ధ చూపి రాణించాలని ప్రిన్సిపాల్ ఎన్.సావిత్రి అన్నారు. ఇటీవల రేపల్లెలోని మౌంట్‌ఫోర్టు హైస్కూల్లో జరిగిన క్రీడాపోటీలలో చెరుకుపల్లిలో హోలియర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని పలు బహుమతులను గెలుసుకున్నారు. అండర్-17, అండర్-14 బాలబాలికల విభాగంలో విజేతలైన ఎల్‌నాగకేశవ, మణికంఠలను శనివారం పాఠశాల స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.



క్రీడాకారుడికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

టీడీపీ సీనియర్ నాయకుడు చిన్నశేషగిరిరావు మృతి

వేమూరు, సెప్టెంబరు 28 : మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ చుక్కపల్లి చిన్నశేషగిరిరావు (74) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులు శేషగిరిరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



చిన్నశేషగిరిరావు(ఫైల్)



వృద్ధురాలి హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు (ఇన్‌సెట్లో) మృతదేహాన్ని కారులో తరలిస్తున్న సీసీ ఫుటేజీ

వీడిన వృద్ధురాలి హత్యకేసు

- కారంచేడు వద్ద సీసీ ఫుటేజీతో నిందితుల గుర్తింపు
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

చీరాలటౌన్, సెప్టెంబరు 28 : సినీ ఫక్కీలో వృద్ధురాలిని హత్య చేశారు. ఎట్టకేలకు నిందితులను పోలీసుల చాకచక్యంగా పట్టుకున్నారు. ఆ వివరాలను శనివారం సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. స్థానిక ఉజిలీపేటకు చెందిన గుర్రప్పడి విజయలక్ష్మి (78) ఒంటరిగా ఉంటున్నారు. ఈమె కుమారుడు హైదరాబాద్‌లో, కుమార్తె అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. స్థానికంగానే ఈమెకు చెందిన దుకాణాన్ని పాపరాజుతోటకు చెందిన పాశం కుమార్‌తేజ, కారంచేడుకు చెందిన యార్లగడ్డ రాము టైల్స్ అమ్మకానికి అద్దెకు తీసుకున్నారు. విజయలక్ష్మి వీరి అవసరాలకు డబ్బులు అప్పుగా ఇచ్చేవారు.

హత్య జరిగిందిలా..

విజయలక్ష్మికి చెందిన స్థలాన్ని కొనుగోలు చేసేందుకు కొంతమంది వచ్చారంటూ ఈనెల 15వ తేదీన రాము విజయలక్ష్మిని దుకాణానికి తీసుకొచ్చారు. మాటల్లో ఉంచి కూల్‌డ్రింక్‌లో విష పదార్థాన్ని కలిపి ఇచ్చారు. కొద్దిసేపటికే ఆమె కుప్పకూలి మృతి చెందారు. ఆ మృతదేహాన్ని కారులో ఎక్కించుకుని చిలకలూరిపేట మీదుగా దొనకొండ మండలం గంగాదేవిపల్లి శివారులోని చెట్లలోకి తీసుకువెళ్లి పెట్రోల్‌తో మృతదేహాన్ని దహనం చేశారు. తిరిగి యథావిధిగా వారికేమీ తెలియనట్లు షాపు నడుపుకుంటున్నారు. తల్లి కనిపించడం లేదని సమాచారం అందుకున్న కుమారుడు, కుమార్తె ఈనెల 19వ తేదీన అన్నిచోట్లా వెతికి తేజ, రాములపై అనుమానం వ్యక్తం చేశారు. చివరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

కేసు ఛేదించిందిలా..

మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఎంత గాలించినా అన్ని దారులు మూసుకుపోయాయి. ఈక్రమంలో విజయలక్ష్మి పెద్ద మొత్తంలో ఎవరికి అప్పులు ఇచ్చారో విచారణ చేపట్టారు. ఈక్రమంలోనే నిందితులను గతంలోనే విచారణ చేశారు. ఘటన జరిగిన రోజున వీరు ఎక్కడున్నారో చెప్పేక్రమంలో సమాధానాలకు పొంతన లేకపోవడం, పైగా వీరు కారు కారంచేడు వైపు వెళ్లినట్లు తెలియడంతో సీసీ పుటేజీని పరిశీలించారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని కారులో ఎక్కించుకుని కారంచేడు వద్ద సాయంత్రం 4:10 నిమిషాల సమయంలో వెళుతున్న ఫుటేజీ లభించింది. ఈమేరకు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. వీరి కారును సీజ్ చేశారు. కేసును వేగవంతంగా ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అజిత, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


బధిరుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

పథకాలను వినియోగించుకోవాలి

- న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, సెప్టెంబరు 28 : విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి ఎదగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగవెంకటలక్ష్మి అన్నారు. అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో ఉన్న చైతన్య బధిరుల పాఠశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. నీటి వసతి, ఫ్యాన్‌లు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా, శుచిగా అందించాలని సూచించారు. హెచ్‌డబ్ల్యువో శ్రీనివాసరావు, బధిరుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు పూనూరి ఆరోగ్యం, న్యాయవాది రఫీ ఉన్నారు.


శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు

సమాజాభివృద్ధి అందరి బాధ్యత

చీరాలటౌన్, సెప్టెంబరు 28 : నేటి ఆధునిక సమాజంలో సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం, పౌరసత్వం, హక్కులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పచ్చతోరణం కల్యాణ మండపంలో జరిగింది. ఈసందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్ కరుణరావు, సాయి ప్రసన్న, సామాజిక కార్యకర్త దాసరి ఇమ్మానియేల్, కార్ఫ్ ఫౌండర్ నాదెండ్ల కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జేఎంజే ప్రతినిధి సుజాత, కామధేను, ఉమాదేవి, చుండూరి వాసు, యువత పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి సర్కారు బాసట

90 శాతం రాయితీపై పరికరాలు

పది ఎకరాల వరకు సబ్సిడీ వర్తింపు

జిల్లాకు 25 కంపెనీలు గుర్తింపు

ఇప్పటికే 23,681 హెక్టార్లకు 19,828 మంది రైతుల నమోదు

గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన పథకం

టీడీపీ కూటమి రాకతో తిరిగి మహర్దశ

రైతులకు తీపికబురు. బిందు, తుంపర సేద్యానికి సర్కారు బాసటగా నిలిచింది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో నిర్వీర్యమైన సూక్ష్మ సేద్యానికి (మైక్రో ఇరిగేషన్) పథకానికి ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం తిరిగి జీవం పోసింది. ఈ ఏడాది నుంచే రాష్ట్రవ్యాప్తంగా తిరిగి భారీగా మైక్రో ఇరిగేషన్ అమలుకు నిర్ణయించిన కూటమి ప్రభుత్వం అందులో జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఈ ఏడాది జిల్లాలో ఏకంగా 30వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అమలు చేయనుంది. అందుకోసం దాదాపు రూ.343.08 కోట్లు వెచ్చించనున్నారు. అందులో 90శాతం మేర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేయనుంది. అంతేకాక పది ఎకరాల వరకు సబ్సిడీ వర్తింపుతో పాటు ఏడేళ్ల క్రితం మైక్రో ఇరిగేషన్ పథకం కింద లబ్ధిపొందిన రైతులకు కూడా ఇప్పుడు ఇవ్వనున్నారు.



ఒంగోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అరకొర సాగునీటి వనరులు మాత్రమే అందుబాటులో ఉండి వర్షాధారంపై ఆధారపడి మెట్ట పంటలు సాగు చేసే రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకం వరంలాంటిది. కాలువల ద్వారా ఎకరా పడేందుకు వినియోగించే నీటితో మైక్రో ఇరిగేషన్ ద్వారా రెండున్నర ఎకరాలలో పంట పడించవచ్చు. జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో బోర్లు, బావులు వంటి అరకొర సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఈ పథకం రైతులకు ఎంతో ఉపకరించనుంది. దానిని గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యకాలంలో విస్తారంగా సూక్ష్మసేద్యాన్ని అమలు చేసింది. రాయలసీమ జిల్లాలతో సమానంగా జిల్లాలో సబ్సిడీ పెంచి ఇచ్చి వేలాది మంది రైతులకు ఉపకరించేలా చేసింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.361.88 కోట్లతో 51వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ పథకం అమలు చేయగా 46 వేల మంది రైతులు లబ్ధి పొందారు ఇంకా లక్షన్నర హెక్టార్లలో పథకం అమలు చేయాలని అప్పటి అధికారులు ప్రణాళిక రూపొందించారు.

పథకాన్ని గాలికొదిలేశారు

అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సూక్ష్మసేద్యాన్ని నిర్లక్ష్యం చేసింది. తొలి మూడేళ్లు అసలు పట్టించుకోలేదు. అయితే రైతులలో అసంతృప్తి, ఇతర వర్గాల నుంచి విమర్శలు రావడంతో 2022-23 సంవత్సరంలో తిరిగి పథకాన్ని చేపట్టింది. అలా 2022-23, అలాగే 2023-24 సంవత్సరాలలో మొక్కుబడిగా అమలు చేసింది. కేవలం 16 వేలమంది రైతులకు చెందిన 17,700 హెక్టార్లలో రూ.196 కోట్ల వ్యయం చేశారు. అయితే అందులో రైతులకు ఇచ్చే రాయితీని తగ్గించి వేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 90శాతం రాయితీ ఇవ్వగా దానికి 70 శాతానికి తగ్గించడంతోపాటు పది ఎకరాల గరిష్ఠ విస్తీర్ణాన్ని ఐదు ఎకరాలకు తగ్గించారు. అంతేకాక మొత్తం రెండేళ్లలో రూ.196 కోట్ల వ్యయంలో ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.160 కోట్లలో ఒక్క రూపాయి కూడా కంపెనీలకు ఇవ్వకపోవడంతో అరకొరగానే పథకం అమలైంది.

జిల్లాలో భారీగా అమలు

ఈ నేపథ్యంలో అధికారంలోకి టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. సూక్ష్మ సేద్యం అమలు అవసరం ఉండే ప్రాధాన్య ప్రాంతాలలో జిల్లా ఉండగా ఈ ఏడాది కూడా భారీగానే అమలుకు నిర్ణయించింది. ప్రస్తుత జిల్లాలో సుమారు లక్షా 12వేల హెక్టార్ల విస్తీర్ణంలో సూక్ష్మ సేద్యం అమలుకు అవకాశంగా గుర్తించారు. అలాగే ఏడేళ్ల క్రితం లబ్ధిపొందిన వారు తిరిగి సబ్సిడీకి అర్హులని ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో 2017-18 కన్నా ముందు ఈ పథకం పొందిన మరో 58వేల హెక్టార్లకు కూడా తిరిగి ఇచ్చే అవకాశం ఉంది. అలా లక్షా 70వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఐదేళ్లలో పూర్తిస్థాయిలో మైక్రో ఇరిగేషన్ అమలుకు కార్యాచరణ రూపొందించారు. తొలిగా ఈ ఏడాది (2024-25) 30వేల హెక్టార్లలో దాదాపు రూ.343.08 కోట్లతో సూక్ష్మ సేద్యం అమలుకు కార్యచరణ రూపొందించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తి సబ్సిడీపైనా, రైతులకు పది ఎకరాల పరిమితికి పెంచి 90 శాతం రాయితీపై ఇవ్వనున్నారు. పరికరాలు అందజేసేందుకు 25 కంపెనీలను గుర్తించి రైతులు వారికి ఇష్టం వచ్చిన చోట తెచ్చుకునే అవకాశం ఇచ్చారు. అందుకోసం పేరున్న 25 కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసి జిల్లాకు కేటాయించింది. ఆయా కంపెనీల ప్రతినిధులు కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రైతులను కలిసి వారికి అవగాహన కల్పిస్తున్నారు.

చురుగ్గా ఎంపిక ప్రక్రియ: పీడీ

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో రైతుల ఎంపిక ప్రక్రియ చురుకుగా సాగుతున్నట్లు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇప్పటి వరకు 1,220 మంది రైతులకు సుమారు 1,345 హెక్టార్ల విస్తీర్ణానికి మైక్రో ఇరిగేషన్ పథకం మంజూరు చేశామన్నారు. త్వరితగతిన మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పది ఎకరాల వరకు 90శాతం రాయితీ కల్పనపై ప్రభుత్వ విధాన నిర్ణయం తీసుకోగా అందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఆ సౌలభ్యం కూడా వచ్చాక మరింత వేగవంతంగా ప్రక్రియ సాగుతుందని తెలిపారు. అరకొర నీటి వనరులు ఉన్న ఈ జిల్లాకు మైక్రో ఇరిగేషన్ వరంలా ఉపయోగపడుతుందన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

డంప్‌ను గుర్తించిన అధికారులు

జాయింట్ యాక్షన్ కమిటీతోనే నియంత్రణ

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి వెల్లడి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 28 : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అక్రమార్కుల అడ్డుకట్ట వేస్తామని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. పందిళ్లపల్లి, వేటపాలెం తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు శనివారం ఆర్డీవో, తహసీల్దార్ పార్వతి, డ్రైనేజీ డీఈ సుబ్బారావు తదితరుల బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. అందులో రైల్వే, అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు గుర్తించారు. ఓ చోట భారీగా కుప్ప పోసిన ఇసుక, మట్టి కలిసిన డంప్‌ను గుర్తించారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, డ్రైనేజీ శాఖలకు సంబంధిచి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి చర్యలు చేపడతామని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రైవేటు పట్టా భూముల్లో కూడా కొందరు ఇసుక తవ్వకాలు జరిపుతున్నట్లు గుర్తించామన్నారు. సొంత పట్టా భూములైనా మైనింగ్, రెవెన్యూ అనుమతి లేకుండా తవ్వకాలు చేయడం నేరమేనన్నారు. తవ్వకాలు జరిపిన వారికి నోటీసులు మైనింగ్ ఏడీకి సూచించారు. ఎవరు తవ్వకాలు జరుపుతున్నదీ ఫిర్యాదు చేసేవారు స్పష్టంగా చెప్పాలని కోరారు. తహసీల్దార్ పార్వతి సంబంధిత అంశంపై క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు. డ్రైనేజీ శాఖకు సంబంధించి సిబ్బంది కొరత వెంటాడుతోందని, దీంతో తాము పూర్తి స్థాయిలో పనిచేయలేక పోతున్నామని డీఈ సుబ్బారావు తెలిపారు. భవిష్యత్‌లో సంబంధిత అన్ని శాఖలకు సంబంధించి జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగులు కూడా నిర్భిష్టంగా పనిచేసేందుకు అనుకూల వాతావరణం లేదని తమ పరిశీలనలో వెల్లడయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

ప్రతిభామూర్తులు ఎప్పటికీ గుర్తుండిపోతారు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 28 : ప్రతిభామూర్తులు తమ నటన, పాటలతో ప్రజలకు ఎప్పటికి గుర్తుండిపోతారని సినీ విశ్లేషకులు, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి ఆర్‌వీ రాఘవరావు, మిట్టా కామేశ్వరశర్మ అన్నారు. శనివారం చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్మవరపు చారిటీస్ సహకారంతో ప్రతిభామూర్తుల సభ నిమ్మరాజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సినీ గాయకులు రామకృష్ణ, సినీనటుడు రంగనాథ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కోటయ్య, చిన్న, బ్రహ్మం, కాలేషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు కామేశ్వరశర్మ

నేడు గోవుగోష విను గోవిందా కార్యక్రమం

అద్దంకి, సెప్టెంబరు 28 : బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం మండపం వద్ద గోవుగోష విను గోవిందా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి పరుచూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా నాగులపాడు గొట్టిపాటి యూత్ గణపతి నిమజ్జనం

పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు, టీడీపీ నేతలు

ప్రత్యేక పూజలు చేసిన హర్షవర్ధన్

అద్దంకి, సెప్టెంబరు 28 : నాగులపాడు గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సం శనివారం వైభవంగా, కోలాహలంగా సాగింది. మండలంలోని నాగులపాడులో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపునకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ క్రమంలో శనివారం పగలు నాగులపాడులో ఊరేగింపు నిర్వహించగా రాత్రి 7.30 గంటల సమయంలో పట్టణంలోని నాగులపాడు రోడ్డులో విద్యుత్ కాంతుల వెలుగులు, సాంస్కృతిక కార్యక్రమా లు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు ప్రారంభమై దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నదిలో అర్ధరాత్రి నిమజ్జనం చేశారు. ముందు భాగంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఉంచారు. ఊరేగింపు రామ్‌నగర్ సెంటర్‌కు వచ్చే సరికి పలు గ్రామాల నుంచి మహిళలు, యువత పెద్ద సంఖ్యలో వచ్చారు. నామ్‌రోడ్డులో రామ్‌నగర్ నుంచి శ్రీనగర్ వరకు నిండిపోయింది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కుమారుడు హర్షవర్ధన్ రాత్రి 9 గంటల సమయంలో నిమజ్జనం ఊరేగింపు వద్దకు వచ్చి గణపతికి పూజలు చేశారు. టీడీపీ అద్దంకి మండల క్లస్టర్ ఇన్‌చార్జి కరి పరమేష్, మాజీ సర్పంచ్ కరి శివానందబాబు, పలు గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.




నిమజ్జనం సందర్భంగా అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపు (ఇన్‌సెట్లో) గణపతి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి గొట్టిపాటి కుమారుడు హర్షవర్ధన్

జడ్పీలో భారీగా బదిలీలు

10 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

45 మంది ఏవోలు, 44మంది సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం

152 మంది జూనియర్ అసిస్టెంట్లు, 134 మంది రికార్డు అసిస్టెంట్లు కూడా..

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 28: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది భారీగా బదిలీ అయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాల్లో అన్ని విభాగాల్లో 1,049 మంది పనిచేస్తుండగా వారిలో 512 మందికి స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడురోజుల క్రితం 22మంది ఎంపీడీవోలను బదిలీ చేయగా శనివారం మరో 10మందికి బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు(ఏవో)లు 45మంది, సీనియర్ అసిస్టెంట్లు 44మంది, జూనియర్ అసిస్టెంట్లు 152 మంది, టైపిస్టులు 35మంది, రికార్డు అసిస్టెంట్లు 134 మంది, ఆఫీసు సబార్డినేట్లు(అటెండర్లు) 70 మందిని బదిలీచేశారు.

ఇతర జిల్లాల నుంచి వచ్చిన తొమ్మిది మందికి పోస్టింగ్‌లు

కాగా ఇతర జిల్లాల నుంచి ప్రకాశం జిల్లాకు వచ్చిన తొమ్మిది మంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. శనివారం పదిమంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇవ్వగా అందులో ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఒకరిని బదిలీ చేశారు. మూడు రోజుల క్రితం 22మంది ఎంపీడీవోలను బదిలీ చేయగా ప్రస్తుతం పదిమందికి పోస్టింగ్‌లు ఇచ్చారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

కందుకూరు, సెప్టెంబరు 28: త్వరలో కృష్ణాజిల్లాలో అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపిక శనివారం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల క్రీడామైదానంలో జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరుకాగా, ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఎంపికచేశారు. డీఐఈఓ ఓ. శ్రీనివాసరావు, ఆర్ఐవో సాయమన్ విక్టర్‌ల పర్యవేక్షణలో జట్ల ఎంపిక జరిగింది. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ తొట్టెంపూడి సుబ్బారావు, కంభం కళాశాల పీడీ మురళీకృష్ణ, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ ఈదర చింపారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్లుగా నిలవటం ద్వారా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకోవాలని ఆకాంక్షించారు.


ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర క్రికెట్ జట్టుకి ఎంపికైన క్రీడాకారులతో పీడీలు


బాలికల క్రికెట్ జట్టుకి ఎంపికైన క్రీడాకారిణిలు

త్వరగా ఇళ్లు నిర్మించుకోండి

» మన ఇల్లు - మన గౌరవం సభలో

మున్సిపల్ ప్రత్యేక అధికారి నరసింహారావు



మాట్లాడుతున్న అద్దంకి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్అండ్‌బీ డీఈ నరసింహారావు

అద్దంకి, సెప్టెంబరు 28 : ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసుకోవాలని అద్దంకి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్అండ్‌బీ డీఈ నరసింహారావు అన్నారు. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులోని కాలనీలో మన ఇల్లు - మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉన్న లబ్ధిదారులు మార్చి 2025 నాటికి పూర్తి చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు రావని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ కిరణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్లు కొమ్మలపాటి సుధీర్, జబ్బార్, టీడీపీ నేత మాగులూరి గోపి పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసుకుందాం

చీరాల : పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునే విధంగా ప్రభుత్వం మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో నేతాజీ అన్నారు. మండల పరిధిలోని చీరాలనగర్ లేఅవుట్ 2లో శనివారం మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి నిర్మాణం పూర్తికాని వారు వెంటనే ఆ నిర్మాణాలను పూర్తి చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులను అందుకోవాలని సూచించారు. లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, నాయకులు కౌతవరపు జనార్దనరావు, వీరలంకారెడ్డి, నంగు దినేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, సోమయ్య, వేణు, బ్రహ్మయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

పర్చూరు : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణాలకు ఎంపికైన లబ్ధిదారులు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ కోరారు. మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు శనివారం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ గేరా రాజ్‌కుమార్ మాట్లాడుతూ 1414 మంది లబ్ధిదారుల్లో 290 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 842 మంది లబ్ధిదారులకు ఇప్పటికే రూ.5వేల చొప్పున వారివారి ఖాతాలకు జమ చేశారన్నారు. 2025 మార్చికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినవారికి నగదు జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, కార్యదర్శి గౌస్, సిబ్బంది, లబ్ధిదారుల, ప్రజా కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.



చీరాల సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో నేతాజీ



పర్చూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్



సాయిబాబాకు ప్రత్యేక పూజలు

చినగంజాం, సెప్టెంబరు 28 : హనుమ సాయి కుటీరంలోని సాయి మందిరంలో సాయిబాబా జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. సాయినాధుని జయంతిని పురస్కరించుకొని సుప్రభాతసేవ, కాగడా హారతి కార్యక్రమాలను నిర్వహించారు. చినగంజాం గ్రామంలోని పురవీధులలో బాబా చిత్రపటంతో భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు స్వామి వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు ధునిలో కొబ్బరికాయలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మందిర ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. హనుమసాయి కుటీరమ్ ట్రస్ట్ సభ్యులు, అంకిత భక్తుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు

స్వర్ణ(పర్చూరు), సెప్టెంబరు 28 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ గుంటూరు, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న క్యాంప్ కార్యాలయ సిబ్బంది శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందించాలన్న సంకల్పంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో ఎముకులు, కీళ్ల వైద్య, గుండె వైద్య నిపుణులు, మెదడు, నరములు, ఊపిరితిత్తులు, జనరల్ మెడిసన్ వైద్యులు హాజరై వైద్య సేవలు అందిస్తారన్నారు.



కొత్తపేటలోని మలుపు

ప్రమాదానికి పిలుపు ఈ మలుపు

కొత్తపేట(చీరాల), సెప్టెంబరు 28 : చీరాల నుంచి ఒంగోలు వాహనాలు కొత్తపేట ప్రధాన రహదారి నుంచి వెళతాయి. ఈ క్రమంలో కొత్తపేట పరిధిలో నాలుగు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. బొడ్డురాయి దాటిన తరువాత ఒక మలుపు, తరువాత 50 మీటర్లకు మరో మలుపు, ప్రభుత్వ పాఠశాల వద్ద ఓ మలుపు, వేంకటేశ్వరస్వామి పాదాలు వద్ద ఇంకొక మలుపు ఉన్నాయి. ఈ మలుపుల్లో కూడా కొందరు వాహన చోదకులు వేగంగా వెళుతున్నారు. దీంతో పాదచారులతో పాటు నిదానంగా వెళ్లే వాహన చోదకులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే మంచిదని గ్రామస్థులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ఎంపీడీవోగా కుసుమకుమారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న కుసుమకుమారి

బల్లికురవ, సెప్టెంబరు 28 : బల్లికురవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా కుసుమకుమారి శనివారం బాధ్యతలను చేపట్టారు. ప్రకాశం జిల్లా దర్శి ఎంపీడీవోగా పనిచేస్తున్న కుసుమకుమారిని బల్లికురవకు నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఏవో రాంబాబు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

దేవదాయ శాఖ అధికారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న నాగేశ్వరరావు

పర్చూరు, సెప్టెంబరు 28: పర్చూరు గ్రూపు దేవదాయశాఖ అధికారిగా దామా నాగేశ్వరరావు శనివారం బాధ్యతలను చేపట్టారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం, మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పర్చూరు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శిరీష మార్టూరు బదిలీ అయ్యారు. దామా నాగేశ్వరరావుకు పర్చూరు-2తో పాటు, పర్చూరు-1, యద్దనపూడి మండలం యనమదల దేవస్థానాలకు ఇన్‌చార్జి బాధ్యతలను కూడా అప్పగిస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు

చీరాల, సెప్టెంబరు 28 : బోసనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గవిని శ్రీనివాసయాదవ్, పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదం అంశాన్ని రాజకీయం చేయడం తగదన్నారు.

అద్దంకి : శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వైసీపీ ఇన్‌చార్జి చినహనిమిరెడ్డి పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

చేపల అమ్మకందారులకు ఎస్ఐ సూచన

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 28 : స్ట్రయిట్ కట్ వద్ద చేపలు, రొయ్యల అమ్మేవారు ఆదివారం రోజు ట్రాఫిక్ సమస్యకు అంతరాయం కలుగకుండా చూడాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం ఆయన చేపలు, రొయ్యల విక్రయదారులు, పంచాయతీ సిబ్బందితో స్ట్రయిట్ కట్ వద్ద మాట్లాడారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు

చీరాలటౌన్, సెప్టెంబర్ 28 : వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం స్టేషన్ పరిధిలోని కీర్తివారిపాలెం రహదారిలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని హెచ్చరించారు. విధిగా నిబంధనలు పాటించాలన్నారు. సిఐ వెంట ఎస్సై శివకుమార్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ మోటార్ల వైరు చోరీ

మార్టూరు, సెప్టెంబరు 28 : పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లకు ఉన్న కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని రాజుగారిపాలెం పొలాల్లో గురువారం జరిగింది. దాదాపుగా 30 మందికి పైగా రైతులకు చెందిన పొలాల్లో చోరీ జరిగింది. కొంతమంది వ్యక్తులు దాదాపుగా మూడు గంటలకుపైగా కష్టపడితేనేగానీ 30 మోటార్లను బయటకు తీసి కేబుల్ వైరును తీసుకువెళ్లడం సాధ్యంకాదు. చోరీ విషయాన్ని శుక్రవారం రాత్రి పల్లెనిద్రచేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. దాంతో ఆయన రాత్రి సమయాలలో పొలాలు వైపు కన్నేసి ఉంచాలని, అనుమానితులైన వారి వివరాలను తమకు చెప్పాలని రైతులను కోరారు. నాలుగు నెలలు కిందట కూడా ఈ గ్రామంలోని 6 గురు రైతులకు చెందిన కేబుల్ వైర్లు చోరీ అయ్యాయి. వరుస దొంగతనాలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేపు మున్సిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, సెప్టెంబరు 28 : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు.

గంగవరంలో ఉచిత పశు వైద్య శిబిరం

ఇంకొల్లు, సెప్టెంబరు 28 : మండలంలోని గంగవరంలో శ్రీ సత్యసాయి భజన మండలి ఇంకొల్లు, శ్రీ సాయి వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఒంగోలు డివిజన్ ఏడీ డాక్టర్ రమేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు పున్నయ్య, నల్లూరి వెంకటభార్గవి, రమణమ్మ, రవికుమార్, మురళీకృష్ణ పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సేవాదళ్ కోఆర్డినేటర్ గోవర్ధన్, టీ శ్రీనివాసరావు, ఇంకొల్లు భజన మండలి కన్వీనర్ కరి చిరంజీవి, శివాజీ, గోరంట్ల పద్మజ, లక్ష్మణబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి

మార్టూరు, సెప్టెంబరు 28 : గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందిన సంఘటన ఇసుకదర్శి పాండురంగస్వామి గుడి సమీపంలో శనివారం రాత్రి జరిగింది. కొంతకాలంగా యాచకుడు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాడు. అతని వయస్సు 40 ఏళ్ల ఉంటుంది. హైవే మొబైల్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు 28 : మండలంలోని కుంకుపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని మోదేపల్లి ఫీడర్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. రాళ్లపల్లి, మోదేపల్లి, పేరాయపాలెం, ధేనువకొండ గ్రామాలలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

బల్లికురవ, సెప్టెంబరు 28 : మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గరిమిడి శ్రీనివాసరావును శనివారం బల్లికురవలో ఘనంగా సత్కరించారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో శ్రీనివాసరావును ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే సమాజంలో ఎంతో గౌరవం అని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన శ్రీనివాసరావు ఎంతో అదృష్టవంతులని కొనియాడారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 28 : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు జనరేటివ్ ఏఐపై జరిగిన మూడు రోజుల వర్క్‌షాప్ శనివారంతో ముగిసిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ అప్లికేషన్స్ పై ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) విభాగంలో రెండు, మూడవ సంత్సరాలు చదువుతున్న విద్యార్థులకు వ్యాలీ సంస్థ వారు వర్క్‌షాప్‌ను నిర్వహించి శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థులు శిక్షణ సమయంలో తాము నేర్చుకున్న అంశాలపై పట్టు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఆ క్రమంలో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు, డాక్టర్ సీహెచ్ కిషన్, డాక్టర్ పీఎస్ నవీన్ కుమార్, సీహెచ్ సురేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 28: పెంపుడు కుక్కలకు టీకాలు తప్పని సరిగా వేయించాలని అద్దంకి పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.మోహనరావు తెలిపారు. శనివారం రేబిస్ నిర్మూలన దినం సందర్భంగా అద్దంకి ప్రాంతీయ పశు వైద్యశాలలో 22 పెంపుడు కుక్కలకు టీకాలను వేశారు. వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోమియో వైద్యుల డాక్టర్ కావూరి రఘుచంద్ రేబిస్‌కు హోమియో మాత్రలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బొమ్మనంపాడు పశు వైద్యశాల అసిస్టెంట్ సర్జన్ ఆశోక్, పశువైద్యశాల సహాయకులు, గోపాలమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పెంపుడు కుక్కలకు తప్పని సరిగా రేబిస్ వ్యాధి రాకుండా టీకాను వేయించాలని బాపట్ల జిల్లా పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ సూచించారు. శనివారం పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాఖ సహాయ సంచాలకులు డి.మాధవి, పర్చూరు, కారంచేడు పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి





మైలవరం పాఠశాలలో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు.. చీరాలలో నివాళులర్పిస్తున్న విజయ్‌నగర్ వాసులు

» మూఢనమ్మకాలపై తిరగబడిన నవయుగ కవితా చక్రవర్తి

» కొనియాడిన వక్తలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 28 : కవిత్వమే ఆయుధంగా మూఢనమ్మకాలపై తిరగబడిన నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా పలు పాఠశాలలో, సంఘాలు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తపసుమర్తిపాలెంలోని ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు వంగెవరపు రమేష్, అనపర్తి రమేష్, గంగవరపు సిద్దు, నరేష్, వీరశేఖర్, రాజేష్ పాల్గొన్నారు. అంబేడ్కర్ సామాజిక భవనంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాషువా, భగత్‌సింగ్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు మందా జోసప్, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, జైభీమ్‌రావు భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హేబేలు, నాగేశ్వరరావు, అంజయ్య, లైబ్రేరియన్ సుగుణరావు, హనుమంతురావు, ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు పాల్గొన్నారు. ఎస్టీ ఆర్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ బాబూరావు సౌజన్యంతో జాషువాకు నివాళులర్పించారు. హెచ్ఎం కోట అంజమ్మ ఆధ్వర్యంలో బాలబాలికలతో గేయాలు, స్కిట్స్ వేయించారు. పెద్దబాలశిక్ష బుక్స్, పెన్నులను పంచిపెట్టారు. కొత్త పసుమర్తిపాలెంలోని జాషువా విగ్రహానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, డాక్టర్ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, మురళి సుధాకరరావు పాల్గొన్నారు. మైలవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌యం నాగేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు రమేష్, వి. వెంకట్రావు, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల, సెప్టెంబరు 28 : జాషువా జయంతిని మండల పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో దుడ్డు భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కవి జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే జాషువా రచనలు చేశారన్నారు. ఆయన రచనల్లో ప్రధానంగా గబ్బిలం, ఫిరదౌసి రచనలతో బహుజనులను చైతన్య పరిచారన్నారు. కార్యక్రమంలో తేళ్ల సుబ్బారావు, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, గొర్రెపాటి రవి, దుడ్డు వందనం, తేళ్ల లక్ష్మీప్రసాద్, వీరయ్య, అమ్మయ్య పాల్గొన్నారు.

పర్చూరు : ఆధునిక తెలుగు కవుల్లో జాషువా ఒకరని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. మూఢాచారాలపై తిరగబడి చీత్కారాలు పొందిన చోటే సత్కారాలు పొందిన మహనీయుడు జాషువా అన్నారు. శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తేళ్ల వెంకటరాము, అనురంజని, కె.జాన్‌బోస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

రాతి మండపానికి విరాళాల అందజేత

అద్దంకి, సెప్టెంబరు 28 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి శనివారం పలువురు దాతలు విరాళాలను అసిస్టెంట్ కమిషనర్, ఈవో తిమ్మనాయుడుకు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన జమ్మలమడక వెంకట శ్రీనివాసనాగేంద్ర, మాధురి దంపతులు రూ.3,33,333 దర్శి మండలం పావిరెడ్డిపాలెంకు చెందిన వర్రా రమణారెడ్డి రూ.1,01,500 ఈవోకు అందజేశారు. బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు తదితరులు ఉన్నారు.

సుందర పట్టణంగా తీర్చిదిద్దాలి

అద్దంకి, సెప్టెంబరు 28 : అద్దంకి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసిమెలసి పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రను మున్సిపల్ కార్మికులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, భీష్మ, సుబ్బారావు, అలివేలమ్మ, నాగేశ్వరరావు, జాన్, సామ్యూల్ ఉన్నారు.



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జంజనం

అంకితభావంతో పనిచేయడం హర్షణీయం

చీరాల, సెప్టెంబరు 28 : మున్సిపల్ కార్యాలయంలో వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో శనివారం బదిలీపై వెళ్తున్న కమిషనర్ చక్రవర్తి, ఈడీ ఏసయ్య తదితరులకు చైర్మన్ అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న వారు ఇక్కడ పనిచేసినంత కాలం చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, సీనియర్ కౌన్సిలర్ మామిడాల రాములు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 28 : కారంచేడు గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆమరా అంజనేయులు, మువ్వల కాశీవిశ్వనాథం శనివారం ప్రకటనలో తెలిపారు.

సత్తాచాటిన చందలూరు బాలబాలికలు



గెలుపొందిన చందలూరు ఉన్నత పాఠశాల బాలబాలికలు

పంగులూరు, సెప్టెంబరు 28 : అద్దంకి నియోజకవర్గ స్థాయి ఆటలు, క్రీడల పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల బాల బాలికలు వివిధ విభాగాలలో సత్తా చాటారు. నియోజకవర్గ పరిధిలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో శనివారం జరిగిన అండర్-14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం పోటీలో కె.సరిత నియోకవర్గ స్థాయిలో విజయం సాధించి జిల్లా పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల పీడీ కె.ప్రతిమ తెలిపారు. యోగా పోటీలలో అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన ఎస్.శృతి, ఎస్.భవ్య, కె.సరిత, ఎం.వెంకటేష్‌లు విజేతలుగా నిలువగా, అండర్ 17 విభాగంలో ఎ.లిఖిత, ఎస్.సుప్రియ, రత్నకుమార్ విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

వాలీబాల్ జట్టుకు చందలూరు బాలురు

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనే నియోజకవర్గ జట్టులో చందలూరు ఉన్నత పాఠశాల బాలురు ఎంపికయ్యారు. అండర్ 17 జిల్లా వాలీబాల్ పోటీలలో పాల్గొనే జట్టుకు చందలూరు విద్యార్థి జి.మణికంఠ ఎంపిక కాగా, అండర్ - 14లో బాలురు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీడీ ప్రతిమ తెలిపారు. హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.



వాలీబాల్‌కు ఎంపికైన చందులూరు బాలురు